పరిష్కారానికి చేపట్టిన చర్యల్ని అర్జీదారులకు వివరించండి

జగనన్న చెబుదాంపై జిల్లా కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం : వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులకు ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్తికర పరిష్కారానికి చేపట్టిన చర్యలపై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వయంగా అర్జీదారులను కలసి వివరించడం ద్వారా సంతృప్తి పరచవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి ఎస్ పేర్కొన్నారు. దీనివల్ల సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించలేనప్పటికీ కొంతకాల వ్యవధిలో ఆ సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం అర్జీదారులో ఏర్పడి అర్జీల పరిష్కారంపై సంతృప్తి వ్యక్తంచేసే అవకాశం వుంటుందన్నారు. జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా గత వారంలో అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే వినతులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయకుండా, తగిన చర్యలు పూర్తికాకుండా మూసివేయవద్దని స్పష్టంచేశారు. గ్రానైట్ లీజులను అక్రమంగా కేటాయించారంటూ వచ్చిన ఒక వినతిపై గనులు, రెవిన్యూ, జలవనరులు, సర్వే విభాగం అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, విద్యుత్, సాంఘిక సంక్షేమ, గృహనిర్మాణం, గనులు, ఏపివివిపి, పంచాయతీరాజ్, పోలీసు, రిజిస్ట్రేషన్లు, డ్వామా, మహిళాశిశు సంక్షేమశాఖలకు సంబంధించి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై ఆయా శాఖల అధికారుల వివరణ అడిగారు.

జగనన్నకు చెబుదాంకు 217 వినతులు

కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజల నుంచి 217 వినతులు అందాయి. ఎప్పటిలాగే రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై అత్యధికంగా 142 వినతులు అందాయి. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 15, హౌసింగ్ 11, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 25, మునిసిపల్ 09, వైద్య ఆరోగ్యశాఖ 05, జిల్లా ఆసుపత్రులపై 03, డిఆర్‌డిఏకు సంబంధించి 07 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎస్.డి.సి.లు సూర్యనారాయణ, పద్మలత తదితరులు వినతుల స్వీకరణలో పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏపి మోడల్ స్కూల్ భోగాపురం విద్యార్థులు జి.తరుణ్, కె.తరుణ్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు. వీరు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని డి.ఇ.ఓ. లింగేశ్వర రెడ్డి వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి కూడా పాల్గొన్నారు.

జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులను ముందుగా గుర్తించాలి

జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులను ముందుగానే గుర్తించి అప్రమత్తం కావడం ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి పేర్కొన్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో తగిన అవగాహన కల్పించడం ద్వారా ఈ వ్యాధులు సోకకుండా అప్రమత్తం చేయవచ్చన్నారు. ప్రజల్లో యీ వ్యాధులపై అవగాహన కల్పించడంలో పంచాయతీరాజ్, పురపాలక, పశుసంవర్ధక శాఖలు ముఖ్యభూమిక నిర్వహించాల్సి వుందన్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల నిరోధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. శునకాలు, పశువుల ద్వారానే వ్యాధులు మనుషులకు సోకే అవకాశం వుంటుందని, ఆ వ్యాధులు సోకినపుడు వుండే లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. పెంపుడు జంతువులకు వ్యాధినిరోధక టీకాలు వేయించడం ద్వారా జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా నిరోధించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.అప్పల నాయుడు వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటు మందు అందుబాటులో వుంటుందని ప్రజలు కుక్క కాటుకు గురైన వెంటనే ఆసుపత్రికి వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.భాస్కరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ...

"డిజిటల్ బోధన" పై ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక గరివిడి, అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు "డిజిటల్ బోధన" ద్వారా విద్యను అందించడం పై అవంతీస్ సెయింట్ థెరిస్సా కాలేజీ ఉపాధ్యాయుల(రిసోర్స్ పర్సన్స్) ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 3 నుండి ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ మన ప్రియతమ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ప్రపంచ స్థాయి డిజిటల్ బాటలో మన రాష్ట్రం ముందుండాలనే లక్ష్యంతో ఈ "డిజిటల్ బోధనను" ప్రవేశపెట్టారని తెలియజేశారు. ఈ వారంరోజుల్లో రేగిడిఅమదాల వలస, వంగర, పాలకొండ, సంతకవిటి, చీపురుపల్లి, గరివిడి, తదితర మండలాలకు చెందిన 1500 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్లాట్స్ వైజ్ శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. అలాగే ప్రతి ఉపాధ్యాయుడికి 2 రోజులు శిక్షణ ఉంటుందని తెలియజేశారు. సాంకేతిక శిక్షణలో డిజిటల్ కంటెంట్ యూటిలైజేషన్, బైజూస్ యాప్ డైరెక్ట్ కనెక్టివిటీ, ఇంటర్నెట్ నుండి పెన్ డ్రైవ్, వాట్సాప్ లకు డేటా బదిలీ, స్క్రీన్ రికార్డింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వం ఈ డిజిటల్ బోధనను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పి), స్మార్ట్ టీవీస్,టాబ్స్ ద్వారా అందిస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏమ్ఈఓ పి.రామారావు,డి.అప్పన్న ఎంఈఓ 2, గరివిడి,వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్ కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సత్య & సీతం ఎన్‌సిసి విద్యార్థుల ఆధ్వర్యంలో పునీత్ సాగర్ అభియాన్ నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పునీత్ సాగర్ అభియాన్ 2023లో భాగంగా సత్యా డిగ్రీ కళాశాల మరియు సీతం కళాశాల ఎన్‌సిసి క్యాడేట్స్ సంయుక్తంగా 2 (ఆంధ్ర) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి. విజయనగరం వారి ఆధ్వర్యంలో క్యాడేట్స్ కాగితపు సంచులను తయారు చేసి వాటిని రద్దీగా ఉండే ప్రదేశాలలో మార్కెట్ పరిసరాలలో అయినటువంటి గంటస్తంభం నుంచి కాంప్లెక్స్ వరకు సంచులను పంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణ్ రావు మాట్లాడుతూ "ప్లాస్టిక్ బ్యాగులను నిషేధిస్తూ కాగితపు సంచులను వాడటం పర్యావరణాన్ని కాపాడడంతో పాటు హైజిన్ గా ఉండవచ్చు. ఎన్. సి. సి. క్యాడేట్స్ ఇటువంటి కార్యక్రమాలను చేస్తూ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా ఉండాలి అని చెబుతూ చెప్పడం జరిగింది. ప్రకాష్ సిల్క్ ప్యాలెస్ ప్రకాష్ రావు మాట్లాడడం జరిగింది. ఆయన "ఎన్సిసి క్యాడేట్స్ అందరూ కలిసి 600 కాగితపు బ్యాగులను తయారు చేయడం అనేది ఆశ్చర్యకరమైన విషయమని" మెచ్చుకున్నారు. డాక్టర్ కేసలి అప్పారావు, చైర్మన్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మాట్లాడుతూ "ఇలాంటి కార్యక్రమాలు ఇంకా ఇంకా జరగాలని ఇంతటి ప్రోత్సాహం ఇస్తున్నందుకు. ఎన్సిసి వాళ్లందరికీ, ఇలా పర్యావరణాన్ని రక్షించాలని ఆలోచనలకు, అతను సీతం మరియు సత్యాసంస్థలను మెచ్చుకున్నారు. గోవింద్ డి.ఎస్.పి విజయనగరం మాట్లాడుతూ "ట్రాఫిక్ పోలీసులు ఎంతగానో ప్లాస్టిక్ నివారణను నిషేదిద్దామని ప్రయత్నిస్తున్నారని అందులో ఎన్సిసి క్యాడర్స్ కూడా ఈ విధంగా పేపర్ బ్యాలెన్స్ తయారు చేసే పంచడం అనేది చాలా సంతోషపరిచి విషయమని చెప్పారు. శ్రీ రాములు నాయుడు కమిషనర్ మున్సిపల్ కార్పొరేషన్ మాట్లాడుతూ 2017 నుంచి ప్లాస్టిక్ ని చాలా వరకు నిర్మూలిస్తూ వస్తున్నారని అంతేకాకుండా ఈయన ప్లాస్టిక్ లో ఉండే రకాల గురించి ఏ ప్లాస్టిక్ వాడాలో ఏ ప్లాస్టిక్ వాడకూడదు అనేది కూడా రెండు వాక్యాల్లో చెప్పడం అనేది జరిగింది. కార్యక్రమంలో కెప్టెన్ సత్యవేణి, రామ్‌దత్ , సుబేదార్ మేజర్, టు ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ విజయనగరం, లెఫ్టినెంట్ ఎం. వరలక్ష్మి మరియు ఎన్సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర-మెంటాడ : అర్హత ఉండి ఏమైనా చిన్న చిన్న కారణాలవల్ల అందవలసిన సంక్షేమ పథకాలు అందకపోతే అట్టి వారిని గుర్తించి వారికి సంక్షేమ సంక్షేమ పథకాలు అందకపోవడానికి గల కారణాలు తెలుసుకొని అట్టివారి కి సంక్షేమ పథకాలు అందేలా చేయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటి సి ఎం,గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం గా ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీ కారం చుట్టారని ప్రభుత్వ సిబ్బంది, వాలంటిరులు, గృహ సారాదులు, సమన్వయ కర్తలు ఇళ్ల వద్దకే వచ్చి11రకాల సేవలు అందిస్తారని చెప్పారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా చాలా మందిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చేశామని అలాగే జగనన్న సురక్ష కార్యక్రమానికి అనుసందానంగా జగనన్నకు చెబుదాం కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా సంక్షేమ పథకాలు పొందడానికి కావలసిన సంబంధిత సర్టిఫికెట్ లు లేకపోవడం వలన కొంతమందికి సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారని అందుచేత ముందుగా వాటికి కావాల్సిన సర్టిఫికెట్ లు ఉచ్చితంగా అందచేయడానికి తగిన లబ్ధిదారులను గుర్తించి వారికి లబ్ది చేకూర్చడం జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశ్యమని అన్నారు. ఈ నెల 28 వరకు జరిగే ఈ జగనన్న సురక్ష సర్వే లో ఇంటికి జల్లెడ పట్టాలని వాలంటిరులకు, గృహారదులకు, సమన్వయకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమం పై దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యసినాయుడు, వైస్ ఎంపిపిలు సారికి ఈ శ్వరరావు, పొట్టంగి దుర్గ, జె డ్ పి టి సి ప్రతినిది లెంక రత్నాకర్ నాయుడు చొక్కాకు సన్యాసి నాయుడు,మండల సచివాలయం కన్వీనర్ కనిమెరక త్రినాథ్, రెడ్డి రాజు గోపాల్, పొరిపిరెడ్డి అప్పలనాయుడు,పలు సర్పంచ్ లు, ఎంపీటీసీలు కార్యకర్తలు, వాలంటీరులు, గృహారదులు, సమన్వయ కర్త లు ప్రభుత్వ అధి కారులు తది తరులు పాల్గొన్నారు.

పీఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పి కామేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పిఏసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు పి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈ కామేశ్వరరావు మాట్లాడుతూ జీవో నెంబర్ 36 మరియు 90 ల ప్రకారం వేతనాలను అమలు చేయాలని 1-4-2016 నుండి మోనాటరించాలని, రిటైర్మెంట్ గ్రాడ్యుటి చట్ట ప్రకారం అమలు చేయాలన్నారు. గ్రామాలలో గల పిఏసిఎస్ లలో రైతులు మాత్రమే వాటాదారులుగా ఉండాలి గాని పిఎసిఎస్ లలో 50% వాటాలను ప్రైవేటు వ్యక్తులకు కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయాలన్నారు. జీవో నెంబర్ 36 లో తీసుకున్న ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా 62 సంవత్సరములు పదవీ విరమణ వయస్సు పెంచాలన్నారు. ఉద్యోగుల పే రివిజన్ ప్రభుత్వంతో సంబంధం లేకుండా డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా వారికి ఏ విధంగా నిర్ణయిస్తారో అదే విధంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్ణయించాలన్నారు సహకార సంఘాలలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని 2019 తరువాత సహకార సంఘాలలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు. జీవో నెంబర్ 36 లో చెప్పిన ప్రకారం డి ఓ పద్ధతిని మాత్రమే అనుసరించి ఆప్కాబ్ మార్గదర్శకాలతో ఇచ్చిన24.90 సాతాన్ని వెంటనే సవరించాలన్నారు ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు రామ్మూర్తి ప్రధాన కార్యదర్శి రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వాకస్వామి నాయుడు (ఫైల్‌ఫోటో)

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని బిసికాలనీకి చెందిన వాకస్వామి నాయుడు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆదివారం సాయంత్రం బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు దొండపర్తి జంక్షన్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ఈప్రమాదంలో స్వామినాయుడుకు తలకు బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే అతనిని విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మించడంతో క్షతగాత్రుడుని విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి స్వామినాయుడు మరణించాడు. మృతి చెందిన స్వామినాయుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జామి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయనజన్మ దిన సందర్భంగా, బొబ్బిలి రాజావారు కీర్తిశేషులు ఆర్ వి జీకే రంగారావు స్మృతులతో జూన్ 22 నుండి జూలై 2 వరకు బేబినాయన పుట్టినరోజు వారో త్సవాలలో భాగంగా ప్రతిష్టా త్మకంగా స్థానిక రాజా కాలేజీ గ్రౌండ్‌లో 18వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బొత్స అప్పారావు(అప్పలు) నిర్వహించిన బొబ్బిలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో నిన్నటి రోజు ఫైనల్ మ్యాచ్ లో విన్నర్‌గా రాయగడ టీమ్ కు,రన్నర్ గా నిలిచినటువంటి బొబ్బిలి గ్రౌండ్ టీమ్ కు మొదటి ప్రైజ్ గా మెమంటో మరియు 50, వేల రూపాయలు నగదును, రన్నెర్స్ కు మెమంటో మరియు 25, వేల రూపాయలు నగదును టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భాన్ని పురష్కరించుకొని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబినాయన విజేతలకు అభినందనలు తెలుపుతూ,ఈ కార్యక్రమాన్ని11 రోజులపాటు ఎంతో ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు బొత్స.అప్పారావుకు అలాగే తెలుగుదేశం పార్టీ పట్టణ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ అనుమతి లేని హాస్టల్స్ పై చర్యలు తీసుకోవాలి : తహశీల్దార్ కు ఏఐఎస్ఎఫ్ వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న వసతిగృహాలపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సోమవారం తాసిల్దార్ కార్యాల యంలో తాసిల్దార్ డోల రాజేశ్వరరావుకు ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి హరికృష్ణ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక బొబ్బిలిలో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూల్స్ అండ్ కాలేజిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా హాస్టల్స్ నడపడం దుర్మార్గమని అన్నారు. విద్యార్థుల తల్లి దండ్రుల నుండి అత్యధిక ఫీజు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పర్మిషన్ లేని హాస్టల్స్ ను సీజ్ చేయాలని కోరారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దుర్గ, శరత్, మనీ, నందు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

నేడు ఎస్‌విడి కళాశాలలో ఉద్యోగ మేళా

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలోఉపాధికల్పనలో భాగంగా నాలుగవ తేదీ మంగళవారం ఉద్యోగ మేళ స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ ఉద్యోగమేళాకు ఎంటెక్, బిటెక్, బిఈ బిఎస్సి, ఎంఎస్‌సి కంప్యూటర్స్ ఎంసీఏ, బిసిఎస్, ఎంసిఎస్, ఎంసిఎం 2022-2023 సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించి వారు చివరి సంవత్సరం చదువుతున్న వారికి సైట్ స్పెక్ట్రమ్ టెక్నాలజీస్ కంపెనీలో సాఫ్ట్వేర్ ట్రైనీగా ను, డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి ఎమ్మెన్ఎస్ లేబరేటరీలో జూనియర్ఎగ్జిక్యూటివ్ & ట్రైనీ ఆఫీసర్, ముత్తూట్ ఫైనాన్స్ లో ఇంటెర్న్ & పి.ఓ గా నందు ఉద్యోగాలు కల్పించబడతాయన్నారు.18 నుండి 27 సం॥ల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు నాలుగవ తేదీ మంగళవారం శ్రీ వెంకటేశ్వర గవర్న మెంట్ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ మరియు యువకులకుతమ వివరములను ఏపీ ఎస్ ఎస్ డి సి వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా రెస్యూమే,ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్,1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావాలన్నారు.మరిన్ని వివరములకు 9182398325, 7997299739 నందు సంప్రదించాలని కోరారు.

ధర్మారావు కుటుంబానికి ఆర్థిక సాయం



విశాలాంధ్ర-కొమరాడ: గత నెలలో పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారావు మృతి చెందిన విషయం తెలిసినదే. ధర్మారావు కుటుంబం చాలా ఆర్థికం గా వెనకబడింది .ఆర్థిక పరిస్థితులు బాలేక కోటిపాం గ్రామం తరపున కుటుం బానికి సోమవారం కోటిపాం గ్రామస్తులు కలిసి ధర్మా రావు కుటుంబానికి 25 వేలు ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ భర్త సుంకర వెంకటరమణ ఆధ్వర్యం లో ఆ నగదు మొత్తం బాధితు కుటుంబానికి అందజేశారు.

ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్లకు ప్రవేశపరీక్ష

విశాలాంధ్ర-కురుపాం : స్థానిక ఆదర్శ పాఠశాల లో 7, 8, 9 , తరగతుల మిగులు సీట్లకు భర్తీకి ఈ నెల 5 వ తేదీ బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ. సుందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష రాయడానికి వచ్చినటువంటి విద్యార్థులు వారి యొక్క స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు పట్టుకొని 5న మోడల్ స్కూల్ కు హాజరుకావాలన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పార్వతీపురం విద్యార్థులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఈనెల 7 8 9 తేదీలలో కర్ణాటకలో జరగనున్న నేషనల్ స్థాయి తైకాండో పోటీలకు పార్వతీపురం విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ అనిల్ కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల1, 2 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైకొండు జూనియర్స్ ఛాంపియన్షిప్ లో అనిల్ శర్మ అకాడమీ కి ఒక గోల్డు ఒక సిల్వర్ ఒక బ్రాంచ్ కైవసం చేసుకోగా బాయ్స్ క్యాటగిరి లోని ఒక బ్రాంచ్ మెడల్, ఫూమేస్ క్యాటగిరి లోని మూడు బ్రాంజ్ మెడలు సంపాదించడం జరిగిందన్నారు. జులై 7,8,9 తారీకు లోని జరగబోయే నేషనల్ స్థాయి పోటీలు కు ఈ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి : డిఐఓ జగన్మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం: సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన బలిజిపేట మండలం అజ్జాడ గ్రామంలో సచివాలయం, స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను సోమవారం సందర్శించారు. గ్రామంలో ఆరోగ్య పరిస్థితులపై సచివా లయం సిబ్బంది, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్ గా వచ్చే జ్వరాలు, తదితర రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైడే కార్యక్రమాలను పక్కగా నిర్వహించాలని, దోమల అవాసాలను గుర్తించి సిబ్బంది సమన్వయంతో పని చేసి నివారణచర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు(ఎన్ సిడి సర్వే) గురించి ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులు తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ పక్కగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లల ఆరోగ్య పరిశీలన చేశారు. అలాగే ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పోషకాహారం బాగా తీసుకోవాలని తద్వారా రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందని, రక్తహీనత లేకుండా ఉంటారని పిల్లలకు డిఐఒ జగన్మోహనరావు అవగాహన కల్పించారు. జ్వరాలు, ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సిహెచ్. జగన్మోహనరావు, వైద్య సిబ్బంది చిన్నమ్మలు, సోనియా, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు-నేడులో మంజూరైన అంగన్వాడి భవనాల నిర్మాణ, మరమ్మతు పనులు వెంటనే పూర్తిచేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: నాడు-నేడు పథకంలో మంజూరైన అంగన్వాడి భవనాల నిర్మాణ, మరమ్మత్తు పనులను వెంటనే పూర్తిచేయాలని మహిళ మరియు శిశు అభివృద్ధి శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి. చిన్మయిదేవి తెలిపారు. సోమవారం స్థానిక సామాజిక భవనంలో జిల్లా పరిదిలో గల సిడిపిఓ లు మరియు సూపర్ వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నాడు నేడు పనులు పురోగతిని సమీక్షించారు. భవనాల నిర్మాణాల పనులను ప్రస్తుతం ఉన్న స్టేజ్ నుండి మూడురోజులలో తరువాత స్టేజికి తీసురావాలన్నారు. ఎంఎస్ కె విజిట్స్, ఆధార్ లింకేజీ శతశాతం పూర్తి చెయ్యాలన్నారు. గర్భిణి మరియు బాలింతలకు జూలై పదిహేనవ నుండి అందిస్తున్న టిహెచ్ఆర్ (అంగన్వాడీ కేంద్రాల నుండి సరుకులను ఇంటికి ఇచ్చుట) పై లబ్ధిదారులకు ఇంటివద్ద ఆహారం తినేవిదంగా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మహిళ మరియు శిశు అభివృద్ధి శాఖ నుండి అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సరకులు బయట మార్కెట్ లోకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ, మహిళ సాధికారిత అధికారిణి కె. విజయ గౌరీ, జిల్లా పరిదిలో గల సిడిపిఓలు మరియు సూపర్ వైజర్లు హాజరయ్యారు.

ఎమ్మెల్యే చొరవతో పరిష్కారమైన డ్రైవర్ల సమస్య

- 'ఆర్టీసీలో కోల్డ్ వార్' వార్తకు స్పందించిన ఎమ్మెల్యే

- విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక ఆర్టీసి డిపో లో కొన్నిరోజులుగా డిపో మేనేజర్ కు డ్రైవర్ల మధ్య చోటుచేసుకున్న వివాదానికి తెరపడింది. సోమవారం విశాలాంధ్ర పత్రికలో "ఆర్టీసీలో కోల్డ్ వార్" అన్న శీర్షికతో వార్త వెలువడింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు సోమవారం నేరుగా ఆర్టీసి డిపోకు వెళ్లి డిపో మేనేజర్ ఈ కే ఎస్ దుర్గ, జిల్లా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ అధికారి టీవీఎస్ సుధాకర్ తో కలిసి సమావేశమై డ్రైవర్లు సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసి బస్ డ్రైవర్ల కి టిమ్ము తో టికెట్లను జారీ చేసి మళ్లీ వాళ్ళే డ్రైవింగ్ చేయాలనే ఆర్టిసి అధికారుల నిబంధనల మూలంగా నిరక్ష్యరాసులైన డ్రైవర్లు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొం టున్నామని డ్రైవర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా అధికారు లతో మాట్లాడి వారికి అవ గాహన వచ్చినంత వరకు తర్ఫీదు ఇవ్వాలని అంతవరకు వారిని కండక్టర్ సర్వీస్ ల్లోనే విధులకు పంపించాలని అధికారులను అడగగా వారు అందుకు ఒప్పుకోవడంతో పాటు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు దశల వారీగా డ్రైవర్లు అందరికీ పూర్తి అవగాహన కల్పించి విధులు అప్పచెప్ప దం జరుగు తుందని హామీ ఇచ్చారు. దీంతో డిపో మేనేజర్ డ్రైవర్లు మధ్య చోటు చేసుకున్న వాదనకు తాత్కాలికముగా తెరపడింది. సమస్యకు పరిష్కారం దొరకడంతో డ్రైవర్లు ఎమ్మెల్యేకు డిపో మేనేజర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు కత్తిరి నరసింగరావు, అప్పల శెట్టి తాతబాబు పలువురు డ్రైవర్లు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం

మాజీ ఉప ముఖ్యమంత్రి కురుపం ఎమ్మెలే పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం: లోవముతాలో గిరిశిఖర పంచాయతీ గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు లో గడపగడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కురుపం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మంజూరు ,అందుతున్న తీరు ,వాలంటీర్లు,సచివాలయంలో సిబ్బంది పని తీరు ,ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు అందుకోవడానికి మరింత చేరువగా ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు జగనన్న సురక్ష ప్రారంభించటం జరిగిందని ఈ సదావకాశం అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు సక్రమంగా అందు తున్నాయో లేదోఅడిగి తెలుసుకు న్నారు. ఇప్పటికే అందుకున్న సంక్షేమ పథకాలు వివరాలు లబ్ది కి సంబంధించిన కరపత్రాలు లబ్ధి దారులకు అందజేశారు.

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన దృవపత్రాలను అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసర మైన దృవపత్రాలను అందించాలని, తద్వారా ప్రజలకు సంవత్సరం వరకు దృవపత్రాల కొరకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదని జిల్లా కలెక్టరు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్. గోవిందరావుతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టరు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించు గ్రామాలలో అందజేయవలసిన సర్టిఫికెట్స్ ముందురోజే సిద్ధంచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉదయం పూట సర్టిఫికెట్స్ పంపిణీ పూర్తయితే, గ్రామంలో సమస్యలను తెలుసుకొనుటకు, గ్రామస్తులతో మాట్లాడుటకు సమయం ఉంటుందని తెలిపారు. ముందుగా ఇచ్చిన షెడ్యూలు ప్రకారం జగనన్న సురక్ష కేంపులను ఏర్పాటు చేయాలని, షెడ్యూలులో ఎటువంటి మార్పులు చేయకూడదని తెలిపారు. ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు కార్యక్రమం నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం కోరుతూ 117 ధరఖాస్తులు అందజేసారు. కొత్తూరు గ్రామ రెవిన్యూ పరిధిలో గల సుమారు తొమ్మిది ఎకరాలు కొండ పోరంబోకు, పచ్చిక బైళ్ళ భూమి, స్మశాన వాటిక భూమి ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించాలని కొత్తూరు గ్రామ రైతులు, ప్రజలు అర్జీ పెట్టుకొన్నారు. పాచి పెంట మండలం పాచి పెంట గ్రామానికి చెందిన శోభారాణి తన రెండు ఎకరాల పది సెంట్ల సాగు భూమిని మక్కువ మండలం కోన గ్రామానికి చెందిన శంకరాపు లక్ష్మణ బెదిరించి తీసుకున్నారని సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. పార్వతీపురం ఎపిఎస్ ఆర్టీసి డిపో మేనేజర్ సిబ్బందిపై పని భారం పెంచుతున్నారని, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు వినతిని అందజేశారు. మక్కువ మండలం శాబిల్లి పెద్దవలస పంచాయితీ కాముడువలస గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేదని, విద్యుత్ సౌకర్యం కల్పించవలసిందిగా కోరుతూ గ్రామస్తులు దరఖాస్తు అందజేసారు. పార్వతీపురం నుండి కూనేరు వరకు జాతీయ రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఉండటం వల్ల ప్రమాదాలు ఎక్కువ జరుగు తున్నాయని, ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని గోతులు పూడ్చాల్సిందిగా కోరుతూ కొల్లి సాంబమూర్తి, కొమరాడ మండలం గిరిజన సంఘం నాయకులు కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. గరుగుబిల్లి మండ లాన్ని పార్వతీపురం విద్యుత్ సబ్ డివిజన్ కు మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గరుగుబిల్లి గ్రామం నుండి అక్కేన మధుసూదనరావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన, డిఆర్ డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు, జిల్లా ఆర్.డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సప్లయి అధికారి సూర్యారావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్రీ షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: గురుపౌర్ణమి సందర్భంగా ఎస్.కోటలోని పెదఖండేపల్లి రోడ్డులో గల షిర్డీసాయి (దత్తసాయి) బాబా మందిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఆలయ కమిటీ సభ్యులకు తగు ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జీఎస్ నాయుడు, నాయకులు సీహెచ్ సుబ్బారావు, సాయిరాం, చక్కా కిరణ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సాయి, కోన రమణ, ఇంటి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవములు

పార్వతీపురం టౌన్: గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణం లోని పలు సాయిబాబా మందిరాలలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్ములు సాంబశివరావు ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా స్థానిక సౌందర్య నారాయణ మూర్తి నగర్ లో వెలసియున్న శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం తో పాటు కొత్త బెలగాం సాయి నగర్ కాలనీ, ఎర్ర కృష్ణమూర్తి నగర్, జగన్నాధపురం తో పాటు పలు ప్రాంతాలలో సోమవారం బాబా వారికి కాకడ హారతి, ఉదయం 6 గంటలకు సాయిబాబా వారికి సుప్రభాతం, ఉదయం 7 గంటలకు బాబా వారికి పాలాభిషేకం, ఉదయం 8 గంటలకు ఉచిత సామూహిక సాయి సత్య వ్రతములు, బాబా వారి భజన పాటలు నిర్వహించారు. అమ్ములు సాంబశివరావు రచించిన శిరిడి సాయిబాబా వారి జీవిత చరిత్ర, సత్సంగ ప్రసంగం తోపాటు మధ్యాహ్న హారతి, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అలాగే సాయంత్రం 6:15 నిమిషాలకు సాయం సంధ్య హారతి, అనంతరం పల్లకి ఉత్సవం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా దేవాలయాల సాయి సేవ కమిటీ సభ్యులు తో పాటు కోరాడ శ్రీనివాసరావు, సైలాడ సింహాచలం, ప్రెసిడెంట్ దురగాసి రవి, పాలవలస శ్రీనివాసరావు, కందుకూరి ప్రభ, గుణుపూర్ రామకృష్ణ, చందక ప్రకాష్, మరదాన శ్రీనివాసరావు, నటరాజన్, ఆదమ్మ ,శాంతి, సత్యనారాయణ రెడ్డి, కోరాడ చిట్టి, తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పాలాభిషేకం అన్నదానం

వెంకటమంగిదాం: మండలం సోమలింగాపురం గ్రామం లో శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో పాలాభిషేకం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అయిన సిరువూరు వెంకటరమణ రాజు ఆధ్వర్యంలో జరిగింది. పాలాభిషేకం అన్నదాన కార్యక్రమమునకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై శిరిడి సాయిబాబాకు పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ధర్మకర్త వెంకటరమణ రాజు అన్నపూర్ణమ్మ దంపతులు కూడా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మా తండ్రిగారైన చంద్రరాజు గారు ఉన్న సమయంలో సూర్య దేవాలయం అలాగే శివాలయము నిర్మించడం జరిగింది. ఇప్పుడు షిరిడి సాయిబాబా మందిరం 2017 సంవత్సరంలో నిర్మించడం జరిగింది అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతి గురువారం నాడు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాదాం, గోపన్నావలస, జి మర్రివలస సోమలింగాపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు హాజరయ్యారు.

రెడ్‌క్రాస్ యోగా శిక్షణా కేంద్రంలో గురుపూజోత్సవం

విజయనగరం టౌన్ : పట్టణంలోని కంటోన్మెంట్ రెడ్ క్రాస్ యోగా శిక్షణా కేంద్రంలో గురుపూజోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. యోగా కేంద్రం గురువు ఆరి సుందర శివరావు ను యోగ అభ్యాసకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యోగా గురువు శివరావు మాట్లాడుతూ పరిపూర్ణ ఆరోగ్యానికి యోగా ను ప్రతి ఒక్కరు అభ్యసించాలని పిలుపునిచ్చారు. యోగా కేంద్రం, రక్త నిధి కేంద్రం నిర్వహణతో పాటు వివిధ సామాజిక సేవా, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న రెడ్ క్రాస్ సంస్థకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధి కేఆర్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభ్యాసకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాయి సుందర మహారాజ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు

విజయనగరం టౌన్ : నగరంలో ధర్మపురి రోడ్డులో ఉన్న షిరిడి సాయిబాబా కోవెలలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలను సాయి సుందర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. షిరిడి సాయిబాబాను దర్శించుకున్నందుకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సాయిబాబాకు పాలాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సుందర మహారాజ్ మాట్లాడుతూ గురు పౌర్ణమి రోజున శిరిడి సాయి ని దర్శించుకున్న వారికి సుఖ సంతోషాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం అన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ దేవాలయంలో అప్పటినుండి నేటి వరకు ప్రతి గురు పౌర్ణమి రోజున మూలవిరాట్ సాయిబాబా విగ్రహానికి భక్తులు స్వయంగా పాలాభిషేకాలు చేసుకోవడం జరుగుతుందన్నారు. సద్గురువులకు ఎలాంటి ఆడంబరాలు ఉండవని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు .

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కురుపాం: వ్యాసపూర్ణిమ, గురుపౌర్ణమి వేడుకలు స్థానిక షిర్డీసాయి ద్వారకామాయి ,గాయత్రీ శక్తి పీఠంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు, పాలాభిషేకం ,నామసంకీర్తన ,భజన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టి సాయంత్రం షిర్డీసాయి పాదుకలు ,విగ్రహాన్ని పురవీధుల్లో తిరువీధి చేపట్టారు. గాయత్రీ శక్తి పీఠంలో ఆదిగురువు యజ్ఞ భగవాన్ కి పూజలు నిర్వహించి పంచకుండముల గాయత్రీ యజ్ఞం నిర్వహించి అన్నసమారాధన చేపట్టారు. పరిశర ప్రాంతాల్లో గాయత్రీ పరివార్ భక్తులు ,ప్రజలు పాల్గొన్నారు.

బలిజిపేట మండల విద్యాశాఖాధికారిగా సామల సింహాచలం

విశాలాంధ్ర-సీతానగరం: మన్యం జిల్లాలోని బలిజిపేట మండల విద్యా శాఖాధికారి-1గా సామల సింహా చలం సోమవారం భాద్యతలు స్వీకరించారు. ఆయన ఇటీవల ఇచ్ఛాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ ఎం గా పదోన్నతి పొందారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడుగా ఉన్న సింహాచలం ఇటీవల కౌన్సిలింగ్ లో బలిజిపేట మండల విద్యా శాఖాధికారిగా నియమించబడ్డారు. ఆయనను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఆనంద స్థితి రావాలంటే ధ్యానం ఒక్కటే మార్గం

క్రియా యోగ ధ్యాన మందిరం నిర్వాహకులు శ్రీరాం బాబాజీ

ధ్యానం గురువు శ్రీరాం బాబాజీకి జ్ఞాపిక అందిస్తున్న చిన్నారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఆనంద స్థితి రావాలంటే ధ్యానం ఒక్కటే మార్గమని క్రియా యోగ ధ్యాన మందిరం నిర్వాహకులు శ్రీరాం బాబాజీ అన్నారు. శృంగవరపు పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా శ్రీశ్రీశ్రీ మహావతార్ బాబాజీ వారి ఉచిత క్రియ యోగ ధ్యాన మందిరం నిర్వాహకులు శ్రీరాం బాబాజీ, లక్ష్మీ మాతాజీని సభ్యులందరూ ఘనంగా సత్కరించి వారి దీవెనలను అందుకున్నారు. అందులో ముఖ్య భాగంగా గురు, మాతాజీలకు పాద పూజ చేయటం జరిగింది. సభ్యులందరూ సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాం బాబాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని కోరుకుంటారని, ప్రతి ఒక్కరూ ధ్యాన, జ్ఞానమార్గంలో నడవాలని తెలియజేశారు. అనంతరం శిష్యులు జ్ఞానాన్ని, ధ్యానాన్ని అందిస్తున్న గురువులకు పాదపూజ చేసి గురువుల ఆశీర్వాదాన్ని పొందారు.

కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న డివైడర్లను తొలగించండి

జనసేన నాయకులు దంతులూరి రామచంద్ర రాజు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న డివైడర్లను తొలగించి ప్రజలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయాలని జనసేన పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి రామచంద్ర రాజు కోరారు. దీనిపై సోమవారం జిల్లా సూపరెండెంట్ దీపిక పాటిల్ నిర్వహించిన స్పందనలో పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి రామచంద్ర రాజు, త్యాడ రామకృష్ణారావు(బాలు), అడబాల వెంకటేష్ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక తోటపాలెం నుండి కాంప్లెక్స్ మీదుగా వచ్చే ప్రజలకు,కాంప్లెక్స్ నుండి తోటపాలెం నకు వెళ్ళే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు, హాస్పటల్ పనిమీద వెళ్ళే ప్రజలు మరింత ఇబ్బంది పాలు అవుతున్నారని, అడ్డుగా సిమెంట్ దిమ్మల డివైడర్లు ఉండటంతో పంగలంతా వాహనాలతో ట్రాఫిక్ నిలిచి ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని డివైడర్లు తక్షణమే తొలగించి ప్రజలకు ట్రాఫిక్ సమస్యనుండి విముక్తి కలిగించాలని తెలియజేశామన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిచడమే సాగర్ దుర్గ హాస్పిటల్ లక్ష్యం : ఎం.డి. కృష్ణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సోమవారం మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఐ గోపాలరావు విన్నపం మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సాగర్ దుర్గ హాస్పిటల్, సింహాద్రి హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డి. జీ కృష్ణ మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సంస్థలు విన్నపం మేరకు ఇప్పటికే అనేక కేసులు ఉచితంగా తక్కువ ఖర్చుతో చేయడం జరిగిందని అని ఒక్క వ్యాపారము కోసమే కాకుండా సంపాదించిన దాంట్లో కొంత ప్రజా సేవా కోసం వినియోగం చేయడం ఉచిత వైద్య శిబిరాలు, నూతన వ్యాధులు మీదా అవగాహనా సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమం ఉదేశ్యంచి మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఐ గోపాలరావు మాట్లాడుతూ ఇప్పటికే సంఘం విన్నపం మేరకు అనేక కేసులు విషయం లో ఆసుపత్రి యాజమాన్యం మా సంస్థ కు సహకారం చేయడం జరిగిందని మారుమూల గిరిజన పట్టణ గ్రామీణ మురికివాడ ప్రాంతాలలో పేద ప్రజలు పడుతున్న ఆరోగ్య ఇబ్బందులు దృష్టిలో పెట్టు కొన్ని పట్నం లో ఉన్న అనేక హాస్పిటల్ వాళ్లతో మాట్లాడి పేద ప్రజలకు మాతృభూమి సేవా సంఘం ద్వారా సహాయం చేయడం జరుగుతుంద న్నారు ఈ కార్యక్రమం లో హాస్పిటల్ సిబ్బంది రమణ, పిళ్ళ. హరీష్ బాబు సంఘం మహిళా అధ్యక్షురాలు కే. ప్రవళిక తదితరులు పాల్గున్నారు.

ఘనంగా జరిగిన ఇండియన్ క్రిస్టియన్ డే సెలబ్రేషన్స్

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారనీ డా.పి.ప్రేమనందం తెలియచేశారు. పట్టంలో స్థానిక పట్టణ పాస్టర్స్ ఐక్యవేదిక అధ్వర్యం లో భారత దేశ శాంతి కొరకై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డా. ఎం . ఐజాక్, బిషప్ ఎం.పాల్సన్, రెవ.డి ఎలీషా, డా.పాల్ శ్రీనివాస్, రెవ.వివేక్,డా. డి.జాన్ మోజెస్, రెవ.ఎస్.మదు, రెవ.జి. స్టీఫెన్ పాల్, మాట్లాడుతూ భారత దేశానికి మొట్ట మొదట క్రీస్తు సువార్తను ప్రకటించిన యేసు ప్రభువు యొక్క పన్నెండు మంది శిష్యులలో ఒకరైన పరిశుద్ద తోమా క్రీ.శ.52 వ సంత్సరంన భారత దేశానికి వచ్చి కేరళ మల్బార్ మరియు చెన్నై రాష్ట్రంల లో 20 సంవత్సరములు సువార్త ప్రకటించి క్రీస్తు ప్రేమను సమాజానికి చూపించి క్రీ.శ.72 వ సంత్సరములో జూలై 3 తేదిన క్రీస్తు నామము నిమిత్తము హతసాక్షి ఆయెను అని తెలియచేశారు. ఈ సంద్బంగా ముఖ్య అతిథిగా పాల్గొనిన జిల్లా పి.టి సి. ప్రిన్సిపాల్ ఎస్పీ టి. ఆనంద్ బాబు గారి చేతుల మీదుగా పట్టణంలో వున్న అనాధులకు, అనాది పిల్లలకు, యాచకులకు అంధులకు ఫుడ్ పాకెట్స్ పంపిని చేసిరి. కార్యక్రమములో పట్టణ పాస్టర్ల కమిటీ సభ్యులు రెవ. యబ్బోజు, రెవ.ఎల్. మదసుధన్, రెవ. ఎం.సైమన్ సుదీర్, రెవ.పి.ఎస్. ప్రసాద్, రెవ. నికోదేమస్ , రేవ.సునీల్, రెవ.బి.ఆనంద్, రెవ. జయవంత్ బాబు కరుణకుమార తదితరులు పాల్గొన్నారు

20మందికి నిత్యవసరాలు పంపిణీ



విశాలాంధ్ర-జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో హెల్పింగ్ హేండ్స్ సేవా సంస్థ ద్వారా గ్రామంలోని 20మంది నిరుపేదలకు నిత్యవసర వస్తువులను అందజేసారు. ప్రతీ నెలా ఈసేవా సంస్థ ద్వారా నిరుపేదలకు ఇనత్యవసర వస్తువుల పంపిణీతోపాటు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలను ఈసేవా సంస్థ నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈనెల నిత్యవసర వస్తువులను పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. అలాగే తమ సేవా సంస్థను రిజిస్ట్రేషన్ చేయించామని, కార్యవర్గంను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సేవా సంస్థకు అధ్యక్షునిగా కొవ్వాడ సన్యాసినాయుడు, ఉపాధ్యక్షునిగా కిలారి శ్రీనివాసరావు, కార్యదర్శిగా మిడతాన తాతం నాయుడులతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

ప్రభుత్వ భూములు, బందలు, గెడ్డ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలి

- అక్రమ నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- ధర్నా కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎన్.కోట మండల పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు, బందలు, గెడ్డ స్థలాల్లో వెంటనే ఆక్రమణలను తొలగించి ఆక్రమణ దారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ చెరువులు, గెడ్డ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని శృంగవరపుకోట మండల పరిధిలో చెరువులు, బందలు, గెడ్డలు, పోరంబోకు భూములు విచ్చలవిడిగా కబ్జాకు గురవుతున్నాయి. ఇప్పటికే ఎస్.కోట పట్టణ శివారు బర్మాకాలనీ వద్ద గేవళ్ల బంద మొత్తం ఆక్రమణకు గురైందని తెలిపారు. ఇక బర్మాకాలనీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న రాజు చెరువు వరకు ఉన్న గెడ్డను ఆక్రమించిన 46 మంది పై క్రిమినల్ చర్యలు తీసుకోవటంతో పాటు వారి చెర నుంచి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. అలాగే రామకృష్ణ మోడల్ స్కూల్ వెనుక ఉన్న బంద నుంచి రాతి చెరువు వరకు ఉన్న గెడ్డ ఆక్రమణలను, జగ్గు చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరారు.

అలాగే కొత్తూరు వద్ద ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి నిర్మాణదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ఇక మండల పరిధిలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, జి.అప్పారావు, జి.సన్యాసిరావు, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జాగరంలో వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-జామి: మండలం లోని జాగరం గ్రామంలో ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ (డిస్ట్రిక్ట్-214ఎ) ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా జైజవాన్, జైకిసాన్ కార్యక్రమంలో భాగంగా జవాన్‌ను, కిసాన్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం 15మంది నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేసారు. అలాగే గ్రామంలో నిరుపేద అయిన ఆర్యవైశ్య కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేసారు. గ్రామానికి అవసరమైన సిమెంట్ బెంచీలను అందజేసారు. ఈకార్యక్రమంలో జిల్లాకు చెందిన బండారు సీతామహాలక్ష్మి, కీర్తన, సుశీలా, బండారు సన్యాసిరావు, జాగరం వాసవీ క్లబ్ అధ్యక్షుడు అక్షింతల వరహాల శెట్టి, కార్యదర్శి పి. రామకృష్ణ, కోశాధికారి సి. రాముతోపాటు సభ్యులు పాల్గొన్నారు.

దొంగే.. దొంగ అన్నట్లుగా టీడీపీ నాయకుల తీరు

- ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి

రెండు నెలల్లో అంబటిసత్రం - కొత్తపేట రహదారి పనులు
వారు చేయలేక చేతులెత్తేసినవే.. మేము పూర్తి చేస్తున్నాం
నగరంలో మౌలిక సదుపాయాల కల్పన మా హయాంలోనే..

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : దొంగే.. దొంగ, దొంగ అని అరిచిన చందాన తెలుగుదేశం పార్టీ నాయకుల తీరు ఉందని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి ఎద్దేవా చేశారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో చేయలేక, చేతులెత్తేసిన పనులను సైతం.. అభ్యంతరాలను పరిష్కరిస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ తాము పూర్తి చేసుకుని వస్తున్నామని వెల్లడించారు. పలు కారణాలతో కొన్నేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయిన అంబటి సత్రం కూడలి - కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు రహదారిని ఆయన సోమవారం స్వయంగా పరిశీలించారు. రహదారి మొత్తం నడిచి.. పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పన తమ హయాంలోనే జరిగిందన్నారు. కొన్ని దశాబ్దాలుగా వేసవిలో ఇక్కడ తీవ్ర నీటి ఎద్దడి ఉండేదని, తాము తీసుకున్న చర్యల వల్ల ఈ ఏడాది ఎక్కడా సమస్య ఉత్పన్నం కాలేదని వెల్లడించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచామని, మారుమూల ప్రాంతాలకు సైతం రహదారులు వేయిస్తున్నామని చెప్పారు. కంటోన్మెంట్ - బాలాజీ కాంప్లెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు.. మయూరి కూడలి - బాలాజీ , ఆర్అండ్ బీ కూడలి - పాల్ నగర్, బాలాజీ - గంటస్తంభం తదితరచోట్ల కొన్నిచోట్ల పనులు పూర్తి కాగా, మరికొన్ని త్వరలోనే అవుతాయన్నారు. ప్రధానంగా అంబటి సత్రం - కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు రహదారి పెండింగ్ లో ఉందని, ప్రస్తుతం ఆ దస్త్రం ఆర్థిక శాఖ వద్ద సిద్ధమైందని వివరించారు. రాబోయే రెండు నెలల్లో టెండరు ప్రక్రియ పూర్తి చేసి, పనులకు వెళ్తామన్నారు. ఇంకా ఎక్కడైనా పెండింగ్లో ఉన్నా.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళుతున్న సమయంలో గుర్తించి, వెనువెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ రహదారుల్లో అధిక శాతం గత ప్రభుత్వ హయాంలో మంజూరై, పూర్తి చేయలేకపోయినవేనని చెప్పారు. సమస్యలున్న చోట, న్యాయస్థానాల్లో కేసులు ఉన్న వాటిని పరిష్కరిస్తూ, స్థానికులను ఒప్పిస్తూ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు.

వారు చేయలేని పనులను మేము చేస్తే తప్పా?

టీడీపీ వారు చేయలేని పనులను తాము పూర్తి చేస్తున్నామని, అందుకే ఓర్వలేకే దుష్ప్రచారానికి దిగుతున్నారని కోలగట్ల అన్నారు. తమ పాలన ప్రజలకు నచ్చింది కాబట్టే, కార్పొరేషన్ ను అప్పగించారని గుర్తు చేశారు. తమ పాలన పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో, భరోసాగా ఉన్నారని.. వారు ఎక్కడా అసంతృప్తి ప్రదర్శించడం లేదని తెలిపారు. ప్రతిపక్షాలకు మరో దారి లేక.. ప్రజల పేరిట రోడ్డెక్కుతున్నాయని విమర్శించారు. టీడీపీ వారు ప్రతీ వారం గ్రీవెన్స్ లకు వెళ్లి వినతి పత్రాలు ఇవ్వడానికి తప్ప, ఎందుకూ పనికిరారన్నారు. చిన్న విషయాన్ని కూడా ప్రతిపక్షాలు భూతద్దంలో చూపిస్తున్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు అశోక్ ఏనాడూ బాధ్యతగా వ్యవహరించలేదని.. ఆయన ప్రజల్లోకి వచ్చారంటే ఎన్నికలు సమీపించినట్లే అర్థమని ఎద్దేవా చేశారు. అంబటి సత్రం రహదారి పూర్తయితే, నగరంలోని ప్రధాన మార్గాల పనులన్నీ పూర్తి చేసినట్లేనని కోలగట్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి. రాజేష్, జోనల్ ఇన్చార్జులు ముచ్చు శ్రీను యాదవ్, ముద్దాడ మధు, అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు, పలువురు కార్పొరేటర్లు, ర.భ.శాఖ, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం టిడిపి తోనే సాధ్యం

టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కరణం శివ రామకృష్ణ

విశాలాంధ్ర-బొండపల్లి : సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం చేయడం ఒక్క టిడిపితోనే సాధ్యం అని టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కరణం శివ రామ కృష్ణ అన్నారు. సోమవారం మండలం లోని కిండాం అగ్రహారం, మరువాడ కొత్తవలస,వెదురవాడ,మరువాడ గ్రామ పంచాయతీ లలో గల ఉపాధి హామీ వేతన దారులను కలుసుకొని వారు సమస్యలను శివ రామకృష్ణ అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కరణం శివ రామకృష్ణ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అన్నివర్గాలలో అసంతృప్తి ఉందని గుర్తుచేసారు. సామాజిక ఆర్థిక రంగాలలో అన్ని వర్గాలకు పెద్ద పీట వేసిన ఘనత అప్పటి టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. సమసమాజ నిర్మాణం కోసం టిడిపి పార్టీ భవిష్యత్తుకు గ్యారంటీ పథకాన్ని అమలు చేసేందుకు కృత నిశ్చయంతో ఉందని ఆయన స్పష్టం చేసారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత వలస బాట పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రం లో పరిశ్రమలు పెట్టక పోగా ఉన్న పరిశ్రమలను బయటకు పంపించిన చరిత్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదే అన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేలు రూపాయలు నిరుద్యోగ బృతి తో పాటు ఏడాదికి ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన వివరించారు. అనంతరం వేతన దారులకు శివ రామకృష్ణ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసారు.ఇది ఇలా ఉండగా మరువాడ కొత్తవలస గ్రామంలో శివరామకృష్ణ కు మహిళలు కుంకుమ తిలకం దిద్ది హారుతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి శ్రీనువాస రావు, కొవ్వాడ బాలరాజు, బూర మహేష్, శివ కుమార్, చంద్ర రావు, బొండపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు పైల శ్రీనువాస రావు, సీనియర్ టిడిపి నాయకులు తాళ్ళపూడి అప్పలనాయుడు, లెంక చిన్నం నాయుడు,లెంక సత్యన్నారాయణ, సత్తిబాబు, మహేష్, లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కు వినతిపత్రం అందించిన ద్విచక్ర వాహన మెకానిక్‌లు



విశాలాంధ్ర-బెలగాం: తమ జీవనాన్ని మెరుగుపరచుకోవడానికి తోడ్పాటు అందించాలని కోరుతూ పార్వతీపురం ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమకు బిఎస్ 6 వాహనాల వలన రిపేరు చేయడానికి చాలా ఇబ్బంది కలుగుతుందని, మా దగ్గర బిఎస్ 6 వాహనాలను రిపేర్ చేసే సాంకేతిక పరికరాలు అందుబాటులో లేనందున, మా దగ్గర వాహనాలు రిపేర్ చేయించుకునేందుకు వినియోగదారులు ఎవరు రావడం లేదని, అందువలన మా జీవన విధానంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, దయచేసి ప్రభుత్వం వారు మాకు బిఎస్ 6 వాహనాలకు రిపేర్ ఎలా చేయాలో అన్నదాని పై తరగతులు నిర్వహించి, అలాగే మాకు దానికి సంబంధించిన పరికరాలు అందజేసిన యెడల మేము మా జీవనాన్ని మెరుగుపరుచుకుంటామని టూ వీలర్ మెకానిక్స్ యూనియన్ నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణంలోని ద్విచక్ర వాహనాల మెకానిక్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి

నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రజా సహకారంతో నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేస్తానని నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కొండవల్లి సాంబమూర్తి అన్నారు. సోమవారం ప్రజారోగ్య అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సహకారంతో, సిబ్బంది సమన్వయంతో నగరంలో మెరుగైన పారిశుధ్యానికి కృషి చేస్తానని అన్నారు. కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు అవసరమైన అన్ని విధానాలను అవలంభిస్తామని చెప్పారు. చెరువులలో, కుంటలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్, మందుల పిచ్చికారి వంటివి యుద్ధ ప్రాతిపదికన చేపడతా మన్నారు. మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బదిలీపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారిగా బాధ్యతలు చేపట్టానన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నగరంలో సంపూర్ణ పారిశుద్ధ్య విధానానికి నూతన ఒరవడితో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సాల్మన్ రాజు, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వెంకట్ పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-జామి : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 6 వతేదీన నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ ఎం.సతీష్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని, ఈసమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించడం జరిగిందన్నారు.

అధికారులతో మండల ప్రత్యేకాధికారి సమీక్ష



విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్ని శాఖ అధికారులతో మండల ప్రత్యేకాధికారి రామగోపాల్ సోమవారం ప్రత్యేకంగా సమీక్ష చేసారు. జగనన్నకు చెబుతాం గ్రీవెన్స్‌కు ఆయన స్వయంగా హాజరై పరిశీలన చేసారు. అనంతరం అధికారులతో మండలంలోని ఆయాశాఖల ప్రగతిపై పమీక్ష చేసారు. అనుకున్న విదంగా హౌసింగ్ ప్రగతిని సాదిస్తున్నామని హౌసింగ్ ఎఇ సిహెచ్. వెంకటరావు తెలియజేయగా, అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి మహిళా సంఘం తరుపున రూ.35వేలను అంది స్తున్నామని, ఈరుణంతో ఇంటినిర్మాణం చేసుకోవచ్చని వెలుగు ఎపిఎం ఉమామహేష్ తెలిపారు. ఈసమీక్షలో ఎంపిడిఓ ఎం.సతీష్, తహశీల్దార్ జి. హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ పై అభ్యంతరాలు తెలియజేయండి

మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పురపాలకసంఘ పరిధిలో అనధికార లే-అవుట్లను డైరక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆంధ్రప్రదేశ్, గుంటూరు వారు లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీము నందు జారీ చేయబడిన జిఎంఎస్ నెం.10, తే.08.01.2020దీ ఉత్తర్వులకు లోబడి ఇన్ ప్రిన్సిపల్ లే-అవుట్ల ఆమోదం తెలిపియున్నారని పార్వతీపురం పురపాలకసంఘ పరిధిలో సుందరనారాయణపురం రెవిన్యూ విలేజ్ సర్వే నెం.592/1,2,3ఎ,3బి,3సి, 5పి నందు గల విస్తీర్ణం ఎ? 2.65 సెంట్లు గల స్థలం నందు అనధికారకంగా వేయబడిన 67 ప్లాటులతో కూడిన లే-అవుట్ను ఇన్ ప్రిన్సిపల్ లే-అవుట్గా ఐపిఎల్ పి నెం. 2020/డిటిసిపి-బుడా/పిపిఎం/000022, తే.13.06.2023దీ ద్వారా ఆమోదించుట జరిగినది. పార్వతీపురం రెవిన్యూ విలేజ్ సర్వే నెం.385/2ఎ,396/3పి నందు గల విస్తీర్ణం ఎ.1.47సెంట్లు గల స్థలం నందు అనధికారకంగా వేయబడిన 30 ప్లాటులతో కూడిన లే-అవుట్ను ఇన్ ప్రిన్సిపల్ లే-అవుట్ గా ఐపిఎల్ పినెం.2020/డిటిసిపి-బుడా/పిపిఎం//000023, తే. 20.06.2023దీద్వారా ఆమోదించుట జరిగినదని, కావున పై తెలుపబడిన లే-అవుట్ ప్లానును పార్వతీపురం పుర పాలకసంఘ కార్యాలయ నోటీసు బోర్డు నందు ఈనెల 3 న ప్రచురించుట జరిగినదని కావున సదరు లే-అవుట్ విషయంన ఎటువంటి అభ్యంతరాలు ఉన్న యడల 15 దినములలో లిఖిత పూర్వకంగా పార్వతీపురం పురపాలకసంఘ కార్యాల యంనకు సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారి పి కనకారావు కిషోర్ మున్సిపల్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారులు లేక వెలవెలబోయిన స్పందన



విశాలాంధ్ర-మెరకముడిదాం : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రత్నం అధ్యక్షతన జరిగిన స్పందన కార్యక్రమనకు అర్జీదారులు నుండి స్పందన కరువైంది. కొన్ని సంవత్సరాలు నుండి గ్రీవెన్స్ స్పందన కార్యక్రమాలు జిల్లాలో జరిగేవి. దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రాన్ని ఖర్జూదారులు వచ్చి ఫిర్యాదు చేయడం అచ్చుతరంగా ఉన్నందున ప్రజలు నడుపుతున్న కష్టాలను జిల్లా అధికారులు చూసి మండల స్థాయిలను స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడం మంచిదని భావించి ఆ విధంగా ప్రతి సోమవారం ఏర్పాటు చేయడం జరిగింది ఇలా మండలంలో స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసిన నెలలు గడుస్తున్న అర్జీదారుల నుండి స్పందన కరువైంది. 10 గంటల నుండి ఒంటిగంట వరకు నిర్వహించే స్పందన అధికారుల కే పరిమితం తప్ప అర్జీదాల జాడలేదు సోమవారం నాడు జరిగిన స్పందన కార్యక్రమమునకు అధికారులే తప్ప అర్జీ దార్లు అర్జీదారులు జాడ కనిపించిన దాఖలాలు లేవు. స్పందన కు విచ్చేసిన గ్రామ కార్యదర్శులతో ఎంపీడీఓ రత్నంపాలన పరమైన విషయాలను చర్చించి మామ అనిపించడం జరిగింది ఏది ఏమైనా సోమవారం నాడు నిరసన నిర్వహించిన స్పందనకు అర్జీదారులు ఉండే స్పందన కరువైందని చెప్పవచ్చు ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

మంగళవారం 4, జులై 2023

పెచ్చుమీరుతున్న ప్లాస్టిక్ సంచుల వాడకంతో అనర్థం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు

విశాలాంధ్ర- శృంగవరపుకోట : పెచ్చుమీరుతున్న ప్లాస్టిక్ సంచులు వాడకంతో అనర్థం జరుగుతోందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు హెచ్చరించారు. ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత అవగాహన దినోత్సవాన్ని' ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం పెరిగిపో యిందని, సముద్ర జలాల్లో చూసుకుంటే భారతదేశంలోనే 60 శాతం పైగా ప్లాస్టిక్ పేరుకుపోయిందన్నారు. 2050 సంవత్సరానికి సముద్రాల్లో ఉన్న జీవరాసులు కన్నా ప్లాస్టిక్ ఎక్కువగా ఉంటుందని, దాన్ని నిర్మూలించలేనట్లయితే మానవాళికి పెను ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు. దాన్ని దశలవారీగా తగ్గించడంలో విద్యార్థులు యువత పాత్ర ఎక్కువగా ఉందని కొనియాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓలు బి.సంధ్యారాణి, వలీఖాన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలు, ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వేల సంవత్సరాలు పడుతుందని, కావున మార్కెట్ కి వెళ్లేటప్పుడు నార, గుడ్డ సంచుల్ని తీసుకు వెళ్ళేటట్లు విద్యార్థులు ప్రజలకి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం. రమేష్ కుమార్, లైబ్రేరియన్ స్వామి నాయుడు, చరిత్ర అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసరావు, విద్యార్థులు గౌరీ, నవీన్ మాట్లాడారు.

జ్ఞాన ప్రభోదకుడు గురువే - రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు

విశాలాంధ్ర-బొబ్బిలి : ప్రపంచంలో లౌకిక ఆత్యాత్మిక జ్ఞాన ప్రభోదకుడు గురువే నని గురువు లేకుండా జ్ఞానన్ని సముపార్జన చేయటం అసాధ్యమని రోటరీ క్లబ్ అధ్యక్షులు, ఆంగ్ల భాషా బోధకులు జె సి రాజు విద్యార్థులకు తెలియచేసారు. సోమ వారం మండలం లోని నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాల లో వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకొని గురు పూర్ణిమ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను పూలతో సత్కరించి పాదాభివందనం చేసి ఆసిస్సులు పొందారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వరః అన్నారని గురువును సాక్షాత్తు పరబ్రహ్మతో పోల్చారని గురువు లేకుంటే సమస్తం అంధకారమేనని అజ్ఞాన్ని తొలగించి జ్ఞానమనే వెలుగును నింపేవాడు గురువే నని అన్నారు.సమాజం గురువును గౌరవించాలని తద్వారా ఆ సమాజం విజ్ఞాన సమాజంగా అభివృద్ధి చెందుతున్నదనిఅన్నారు. విద్యార్థులు గురువుల యెడల గౌరవం, భక్తి ,వినయం కలిగి ఉండాలని తల్లిదండ్రులు తరువాత సమాజంలో అత్యధిక గౌరవం గురువు దే నని అన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో గురువు పాత్ర ప్రాముఖ్యమైన దని గురువుల యెడల విద్యార్థు విశ్వాసం చూపటం ద్వారా జ్ఞానవంతుడు అవుతాడని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, కృష్ణ మోహన్, శివున్నాయుడు, బి రవికుమార్, కృష్ణం నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీ చార్జీలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర-బొబ్బిలి : దాన్యం కొనుగోలు కేంద్రాలలో పని చేసిన హమాలీలకు చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో హమాలీలు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.గోపాలం మాట్లాడుతూ తెర్లాం మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలలో పని చేసిన హమాలీలకు హమాలీ చార్జీలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హమాలీ చార్జీలను ప్రభుత్వం విడుదల చేసిన అధికారులు ఇవ్వడం లేదని విమర్శించారు. హమాలీ చార్జీలు ఇవ్వకపోవడంతో హమాలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2020-21, 2021-22 సీజన్లలో హమాలీ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇంచార్జి ఆర్డిఓ సుదర్శనదొరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ మేస్త్రీ సిహెచ్ రామారావు, హమాలీలు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా నాయకులు బల్సా శ్రీను



విశాలాంధ్ర-రామభద్రపురం: అంగన్వాడి కార్యకర్తలు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బలస శ్రీను డిమాండ్ చేశారు. సోమవారము స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడి సమస్యలపై గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రభుత్వము కార్యకర్తలపై వర్కర్లపై చిన్నచూపు చూడ్డం తగదని అన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని అన్నారు. కనీస వేతనం 20000 రూపాయలు ఇవ్వాలని కోరారు. కార్యకర్తలకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పింఛన్ వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అలాగే ఈనెల విజయనగరంలో 9 18 లో జరిగే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలకు చెందిన కార్యకర్తలు వర్కర్లు అందరు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు, రాధా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

అర్హత ఉండి పథకాలు పొందలేని వారి వివరాలు సేకరించాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 48వ డివిజన్ 59వ నెంబర్ సచివాలయ పరిధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వల్ల అన్ని సంక్షేమ పథకాలు నేరుగా తమ ఖాతాలకు అందుతున్నాయని స్థానికులు చెప్పడంతో ఆ ప్రాంతమంతా హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. స్థానికంగా చిన్నచిన్న కాలువలు, రహదారుల మరమ్మతులను చేపట్టాలని అధికారులకు ఆయన ఆదేశించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలను తెలుసుకొని తక్షణమే సంక్షేమ కార్యక్రమాలు అందించాలని అక్కడున్న వాలంటీర్లకు ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటికే చేరువ కావడంతో ప్రజలలో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు. అర్హత ఉండి ధ్రువపత్రాలు పొందలేని వారికోసం ప్రత్యేకంగా జగనన్న సురక్ష పథకం అమలు చేయడం గొప్ప విషయం అన్నారు. మంగళవారం 5,8 నెంబర్ సచివాలయాలలో జగనన్న సురక్ష పథకం కింద లబ్ధిదారులకు ధృవపత్రాలు అందించనున్నట్లు చెప్పారు. సచివాలయ కన్వీనర్ తేజ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. గతంలో ప్రతి పథకానికీ ఓ రేటు ప్రకారం అవినీతి రాజ్యమేలేదని అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లంచగొండితనం లేకుండా నేరుగా ప్రభుత్వ పథకాలన్నీ లబ్ధిదారుల ఖాతాలకు చేరడం వల్ల ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, తవిటి రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువు గొప్పది

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-కొత్తవలస: కార్పొరేట్ స్కూల్ విద్య కన్నా, సర్కారు వారి బడులల్లో చదువు గొప్పదని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కొత్తవలస హై స్కూల్ లో అమ్మఒడి మండల స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పిన పాటలను చక్కగా వినియోగించుకోవాలని అన్నారు. .గవర్నమెంటు స్కూల్ లో చదువతున్న విద్యార్థులకీ జగనన్న తన సొంత బిడ్డలవలే అందరికీ బూటుల దగ్గరనుంచి బట్టలు బ్యాగులూ,పుస్తకాలు, బడికి వెళితే పిల్లలకు ఆరోగ్య కరమైన బొజనం,చదువులో ఆరితేరిన మాస్టర్ల తో విద్యా బోధన జరుగుతుందన్నారు. తల్లి దండ్రులకు అమ్మవడి ,విద్యాకానుక వివిధ రకాలలో జగనన్న విద్యా దీవెన డబ్బులు నీరుగా వారి బ్యాంక్ ఖాతాలో జగనన్న వేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్నప్పుడు మధ్య మధ్య లో జగన్ మామ థ్యాంక్స్ అని విద్యార్థులు చప్పట్ల తో హెూరెక్కిస్తుంటే ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వేలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపీపీ నీలం శెట్టి గోపమ్మ, పి ఎ సి యస్ చైర్మన్ గోరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, చింతలపాలెం పల్లా భీష్మ, వెంకన్న పాత్రుడు, వార్డు నెంబర్ రఘు, కొర్రాయి రాము నాయుడు, రామకృష్ణ ,తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు తది తదితరులు పాల్గొన్నారు.

7వేల కోట్లతో జగనన్న అమ్మఒడి

విశాలాంధ్ర-మెంటాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు చక్కని విద్యాభివృద్ధిలో ముందుండాలని సంకల్పంతో జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక ప్రవేశపెట్టబడిందని అందులో భాగంగా రాష్ట్రంలో 68లక్షల విద్యార్థులకు నాలుగు విడతల్లో 7000 వేలకోట్ల రూపాయలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మండల కేంద్రమైన మెంటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న అమ్మఒడి,విద్యా కానుక నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలంలో 17 వేల 848 విద్యార్థులకు జగనన్న విద్యా కానుక లబ్ధి చేకూరిందని అన్నారు. మొదటి విడతల 8.5 కోట్ల రూపాయలతో 30 పాఠశాలలో నాడు నేడు ద్వారా సకల సౌకర్యాలు కల్పించబడ్డాయని అలాగే రెండో విడతలో నాలుగు కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు ,ఇంటర్మీడియట్ డిగ్రీ పైసలు చదువుతున్న విద్యార్థులకు వర్తింప జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడుఎంఈఓ ఎం వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో త్రివిక్రమ రావు, వైస్ ఎంపీపీలు సారికి ఈశ్వరరావు, తెట్టంగి దుర్గ, గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు చౌక్కాకు సన్యాసి నాయుడు,ఎంపిటిసి పతివాడ కుమారి, ప్రధానోపాధ్యాయురాలు పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ విశ్వవిద్యాలయాల ద్వారా 6 లక్షల మందికి నైపుణ్యాల శిక్షణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల : సెంచూరియన్ విశ్వవిద్యాలయల ద్వారా ఆరు లక్షల మందికి నైపుణ్య విలువలపై శిక్షణ నిచ్చినట్టు వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పి. కె. మహంతి తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ మూడో విడత నైపుణ్య విలువలపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో గిరిజనులకు ఉపాధి శిక్షణ నిచ్చి వారి కాళ్ళ పై వారు నిలబడే విధంగా తీర్చిదిద్దామన్నారు. నూతన రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ప్రతి ఒకరు వినూత్నంగా డీన్ ప్రొఫెసర్ కె వి జి కృష్ణమూర్తి మాట్లాడుతూ జీవిత కాలం నిరంతర విద్యార్థిగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ఎస్. వర్మ, స్కిల్స్ డీన్ ప్రొఫెసర్ మురళి, డీన్ ప్రొఫెసర్ ఎం ఎల్ ఎన్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లెలిపై అన్నదమ్ములు దాడి

విశాలాంధ్ర-బెలగాం: చెల్లెలిపై అన్నదమ్ములు దాడి చేయడంతో తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మునిసిపల్ కొత్తవలస మెయిన్ రోడ్డులో నివాసం ఉంటున్న పెంకి రామలక్ష్మి తన ఇంటి వద్ద టైలరింగ్ వర్క్ చేసుకొంటూ ఉంటాడు. పెళ్లయి 14 సం.లు అయింది. భర్త నుండి విడాకులు తీసుకొని విడిపోయి తన కుమార్తెతో కన్నవారింట్లో ఉంటూ తన తల్లిని చూసుకొని ఉంటుంది. తన తండ్రి చనిపోయిన నుండి తల్లిని నలుగులు అన్నయ్యలు పట్టించుకోలేదు. తల్లి కూడా చనిపోయి 7నెలలు అయ్యింది. తన తల్లితండ్రులు సంపాదించిన భూమి, స్థలాలు అన్నదమ్ములు వాడుకుంటున్నారు. తన తల్లికి పసుపు కుంకుమ క్రింద తన తాత స్థలం ఇవ్వగా ఇల్లు కట్టుకొని చాలా కాలంగా అందులోనే ఉంటున్నారు. తల్లి చనిపోయిన నుండి సదరు ఇంటిని ఖాళీ చేయమని అన్నలు పెంకి లక్ష్మణరావు, పెంకి ఆదినారాయణ, పెంకి రామారావులు కొడుతుండేవారు. ఇల్లు ఖాళీ చేయకపోతే మేమే బలవంతంగా ఖాళీ చేయిస్తామని పొడి చేస్తామని, గోడలు విరగొట్టేస్తాం అని బెదిరింపులు చేసి కొడుతూ వుంటారు. అదే క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసి పెంకి లక్ష్మణ ఇనుప గేటుకు గుద్దించినాడు. ఆదినారాయ చెంప, దవడలపై కొట్టాడు. ఈసంఘటనలో ఆమెకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. గాయపడిన ఆమె సోమవారం ఉదయం ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

4న వంగవీటి మోహన రంగా దొర జయంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : తెలగ యువజన సంఘం ఆధ్వర్యంలో.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలగ కుల బంధువు దివంగత నేత వంగవీటి మోహనరంగా దొర జయంతి వేడుకలు ఈ నెల 4వ తేదీన ఘనంగా నిర్వ హిస్తున్నామని కమిటీ సభ్యులు పిడుగు సతీష్,పుంద్రోతు రవీంద్రకుమార్,యార్లగుల చక్రవర్తి,ముదిలి శ్రీనివాస్,కుందేటి రామకృష్ణలు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కోట జంక్షన్ నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కోట వద్ద నుండి పైడితల్లమ్మ గుడి,గంటస్తంభం,దాబా తోట,ఎన్ సి ఎస్,వెంకటలక్ష్మి జంక్షన్,రైల్వే స్టేషన్,ఆర్టీసి కాంప్లెక్స్,బాలాజీ జంక్షన్ నుండి కోట దగ్గర వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతం కోట వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కేవలం తెలగ జెండాతో జరిగే కార్యక్రమానికి నేను సైతం అని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చినభోగీల గ్రామంలో జనసైనికులతోసమావేశం

విశాలాంధ్ర- సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామ జనసైనికులు ఆహ్వానం మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు సోమవారం వెళ్లి వారితో మాట్లాడి జనసేన సిద్ధాంతాలు ప్రచారం చేయాలని కోరారు. గ్రామ జనసైనికులతో జనసేన పార్టీ షణ్ముఖ వ్యూహం ,వారాహి యాత్ర, పవన్ కళ్యాణ్ అధికారంలోకి వస్తే ఏమి చేస్తారు, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి పదంలో నడిపిస్తారు ముఖ్యంగా యువతకు ఏమి ఉపాధి అవకాశాలు కల్పిస్తారో వివరంగా చెప్పారు. అందరూ కలిసి 2024ఎన్నికలో పవన్ కళ్యాణ్ కు మద్దతుగా నిలవాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల నాయకులు శివశంకర్ పోతల, జయ్ శంకర్,బొబ్బిలి మండల అధ్యక్షులు గంగాధర్ సంచనా, రాజా పళ్లెం, ఇందువ సత్యనారాయణ, గ్రామ జనసైనికులు అనిల్, నాగరాజు, ఉదయ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మరో కృషి విద్యార్థి నవోదయలో ప్రవేశం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని బల్ల కృష్ణాపురం- గెద్దలుప్పి కూడలి వద్ద గల కృషి విద్య నికేతన్ విద్యార్థి పెద్దింటి జశ్వంత్ కుమార్ జవహర్ నవోదయ విద్యాలయంలో 15వ అడ్మిషన్ గా ప్రవేశం పొందినట్లు కరస్పాండెంట్ ద్వారపురెడ్డి శ్రీనివాస రావు తెలిపారు. తమ సంస్థ నుండి జశ్వంత్‌కు సీటు రావడం పట్ల అతన్ని అందరూ అభినందనలు తెలిపారు.

బ్యాడ్మింటన్ కోచ్ శ్రీరాములుకి శిష్యులు ఘన సత్కారం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ క్రీడామైదానంలో గురుపూజోత్సవం సందర్భంగా సోమవారం గంటలకు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ప్రస్తుత క్రీడాకారులు, ఆయన వద్ద బ్యాడ్మింటన్లో శిక్షణ పొందిన మెంటాడ, సాలూరు, గజపతినగరం క్రీడాకారులు డాక్టర్ పొట్నూరు శ్రీరాములును సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ తన వద్ద బ్యాడ్మింటన్ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు రైల్వే, ప్రభుత్వ, పీఈటీ ఉద్యోగాలు సాధించటంతో పాటు, చదువుల్లో మెరుగ్గా రాణించి అనేక ఉన్నత స్థానాల్లో ఉన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. నేను ఎక్కడ ఉన్నా మర్చిపోకుండా వచ్చి ఈ విధంగా నన్ను సత్కరించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మెంటాడలో తన వద్ద శిక్షణ పొందిన గుంప్రోతు శ్రీనివాసరావు ప్రస్తుతం విజయనగరం డిఎస్ఏ ఇండోర్ స్టేడియంలో కోచ్ గా అనేకమంది భావి భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులను తయారు చేస్తూ నా తర్వాత కూడా నా వృత్తి.. నా శిష్యులు ద్వారా సమాజానికి ఉపయోగపడుతున్నందుకు చాలా ఆనందిస్తున్నానన్నారు. ఏ గురువైన కోరుకునేదొకటే తన తర్వాత తన కళ శిష్యులు ద్వారా దేశానికి ఉపయోగపడాలని కోరుకుంటారని, అటువంటి వారిలో నేను ఒక్కడినని వెల్లడించారు. కోచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మా గురువు శ్రీరాములు వద్ద అనేక మంచి విషయాలు నేర్చుకున్నాను. నేను బ్యాడ్మింటన్లో ఈరోజు రాణిస్తున్నాను అంటే దానికి ఆయనే నాకు మార్గదర్శకం. మా తల్లిదండ్రులు చిన్ననాటి నుంచి ఆయన వద్ద వదిలిపెట్టారు అది మొదలుకొని నేటి వరకు ఆయన మాటే నాకు శిరోదార్యం నేను కోచ్ గా మాగురువుగారి ఆశయ సాధనలో, నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న విజయనగరం సిటీ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారికి, మరియు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారికి ఎంతగానో రుణపడి ఉంటారని తెలిపారు .ఈ కార్యక్రమంలో నాయుడు, త్రివిక్రమ్,పవన్ , హారిక ,మౌనిక, క్రీడాకారులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ దంపతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి- సతీష్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. రాష్ట్రం పాడి పంటలతో వర్ధిల్లాలని భగవంతుడుని ప్రార్థించినట్లు ఎమ్మెల్సీ రఘురాజు వెల్లడించారు.

సీజ్ చేసిన వాహనాలు వేలం....

విశాలాంధ్ర-సాలూరు రూరల్: సాలూరు రూరల్ పోలీస్ స్టేషను పరిధిలో వివిధ నాటుసారా కేసులలో పట్టుబడిన వాహనాలను బుధవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు రూరల్ యస్సై ప్రయోగమూర్తి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా యస్పీ ఉత్తర్వులు మేరకు వివిధ నాటుసారా కేసులలో పట్టుబడిన 14 వాహనాలు బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు.4 నాలుగు చక్రాల వాహనాలు,1 ఆటో,8 ద్విచక్ర వాహనాలకు రూరల్ పోలీస్ స్టేషను ఆవరణ లో వేలం నిర్వహిస్తామన్నారు.ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చునని వెల్లడించారు.

గురుదేవులకు ఘన సత్కారం



విశాలాంధ్ర-పాలకొండ: పట్టణంలో నక్కలపేట లో గల షిరిడీ సాయి బాబా మందిరంలో విశ్రాంత ఉపాధ్యాయులు పి. పాండు, బి. కేశవరావులకు షిరిడీ సాయి మందిర ట్రస్ట్ బోర్డు చైర్మన్ పల్లా కొండల రావు ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను జీవితం ఉన్నంత వరకు మరువకూడదని అన్నారు. వారే ఈ ప్రపంచానికి మార్గదర్శకులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి భక్త బృందం వి. శ్రీనివాసరావు, ఎ. శ్రీనివాసరావు, సీహెచ్. సత్తిబాబు, కె. మోహనరావు, పి. సంతోష్, రాంబాబు, కె. వెంకటరమణ, టి. శంకరరావు, టి. సూర్యారావు, బోగాది వెంకటరమణ, అడపా బాబ్జీనాయుడు, కె. రవికుమార్, యు ప్రభాకర్, శిష్యులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో కుండపోత

విశాలాంధ్ర-రామభద్రపురం : రామభద్రపురంలో కుండ పోత వర్షం కురిసింది. మండలంలో సోమవారం ఉదయం అంతా ఎండతీవ్రంగా ఉంది. మధ్యాహ్నం మూడు తర్వాత వాతావరణం చల్లబడింది. నాలుగు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు కుండపోత వర్షం మండలమంతా కురిసింది.

మహాప్రస్థాన రథం బహూకరణ

విశాలాంధ్ర -పాలకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, పూర్వపు చైర్మన్ పల్లా కొండలరావు విజయనిర్మల దంపతులు మహాప్రస్థాన రథాన్ని సోమవారం స్థానిక సెగిడివీధిలో గల సత్యసాయి శివం మందిరం నిర్వాహకులకు అందజేశారు. ఈ స్వర్గ రథం తమ తల్లిదండ్రులు అయిన పల్లా బాబ్జీరావు, సూరమ్మల దంపతుల జ్ఞాపకార్థం సుమారు రూ.10లక్షలు వెచ్చించి తయారు చేయడం జరిగిందని దీన్ని పట్టణ ప్రజలకు అవసరార్థం ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి మందిరం నిర్వాహకులు ఉత్తరావిల్లి ప్రభాకరరావు, కిల్లారి రవికుమార్, సూర్యం మాస్టర్, బెజ్జిపురపు కేశవరావు, పాలమెట్ట పాండు, 6వ వార్డు కౌన్సిలర్ అరపా బాబ్జీనాయుడు, 15 వ వార్డు కౌన్సిలర్ టి. శంకరావు, 16వ వార్డు కౌన్సిలర్ కె. వెంకటరమణ, టీడీపీ పట్టణాధ్యక్షులు గంటా సంతోష్, టీడీపీ సీనియర్ నాయకులు వి. శ్రీనివాసరావు, టి. సూర్యారావు, రిటైర్డ్ ఏఈ శంకరరావు, రియల్ ఎస్టేట్ డి. వెంకటరమణ, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహణ



విశాలాంధ్ర -పార్వతీపురం: మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలమేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమంను మన్యంజిల్లాఅదనపు ఎస్పీ డాక్టరు దిలీప్ కిరణ్ నిర్వహించారు.నేరుగా పిర్యా దుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వేదింపులు , కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు విన్నవించుకోగా, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. అరు ఫిర్యాదులుఅందాయన్నారు. ఈస్పందనలో ఏఆర్ డిఎస్పీ బి. నాగేశ్వరరావు,ఎస్సి సి ఐ ఎన్. శ్రీనివాసరావు, డి.సి.ఆర్.బి ఎస్ఐ వి . పాపారావులు పాల్గొన్నారు.

9నుండి 12వరకు మన్యం జిల్లాలో టీడీపి బస్సుయాత్ర

పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి వెల్లడి



విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 9నుండి 12 వరకు నాలుగు నియోజక వర్గాల్లో టీడీపీ బస్ యాత్ర నిర్వహించడం జరుగుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్సీ, అరకు పార్లమెంట్ అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు.సోమవారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో నాలుగు నియోజక వర్గాల ఇంచార్జిలతో, టీడీపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఆమెకు జగదీష్ పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.భవిష్యత్ కు గ్యారంటీ బాబుయాత్ర పేరిట ఈనెల 9న సాలురులో, 10న పార్వతీపురంలో, 11నకురుపాంలో, 12న పాలకొండ నియోజకవర్గంలలో ఈబస్ యాత్ర ఉంటుందని తెలిపారు. బస్ యాత్రలో ఉత్తరాంధ్ర జిల్లాల పొలిట్ బ్యూరో సభ్యులు, టీడీపి కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్సీలు మాజీ ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇంచార్జిలు, పార్లమెంటు ఇంచార్జిలు, ఆయా నియోజక వర్గ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. ఈనెల 10న పార్వతీపురం నియోజకవర్గంలో సీతానగరం మండలం లోని లచ్చయ్యపేట వద్ద బస్ యాత్ర ప్రారంభం జరుగుతుందని, ముందుగా ఎస్ సీ ఎస్ చక్కెర కర్మాగారంవద్ద బహిరంగ సభ, రైతులతో ముఖాముఖి, ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారంలో నిలిపివేతఅనంతరం పరిణామాలపై చర్చ, సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు అసంపూర్తిగా ఉండటాన్ని పరిశీలన, పార్వతీపురం మండలంలోని ఎంఆర్ నగర్ వద్ద సాంకేతిక కళాశాల పరిశీలన, జంఝావతి కాలువ పనులు పరిశీలన,పార్వతీపురం పట్టణంలో సి కన్వెన్షన్ హాల్లో మీటింగు, టిడ్కో ఇళ్లు సందర్శన ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపు రెడ్డి జగదీష్, టీడీపీ నియోజక వర్గ ఇంచార్జిలు బొబ్బిలి చిరంజీవులు, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణతోపాటు నియోజకవర్గనేతలు గొట్టాపు వెంకట నాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, గర్భాపు ఉదయభాను, వాడాద రాము, టిడిపిపట్టణ పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్,సీతానగరం మండలపార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణు గోపాలనాయుడు, కోలాబాబు ,తాతపూడి వెంకటరమణ, బడే గౌరునాయుడు, బోను దేవీచంద్ర మౌళి,,కెంగువ ప్రదీప్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో గిరిజన మంత్రికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం దారుణం

గతనెలలో మన్యంజిల్లా ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా విచ్చేసిన సీఎం జగన్ బహిరంగసభలో రాష్ట్రఉప- ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖ మంత్రికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం చాలా చాలా దారుణమని, ఇది గిరిజనులకు జరిగిన పరాభవమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు.సోమవారం పార్వతీపురంలో టీడీపి రాష్ట్ర అధికార ప్రతినిధి జగదీష్, మూడు నియోజకవర్గాల ఇంచార్జీలు చిరంజీవులు, జగదీశ్వరి, జయకృష్ణతోకలసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గిరిజన ప్రాంతానికి విచ్చేసిన సీఎం గిరిజనులకు ప్రయోజన కరమైన ఒక్క ప్రకటన కూడా చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. గిరిజన యూనివర్సిటీ గూర్చి స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. పిల్లల సభలో పెళ్ళిళ్ళు గూర్చి మాట్లాడటం అంతా ఆశ్చర్య పోయారని, సీఎం జగన్ మీటింగు పై ఎన్నో ఆశలు పెట్టుకొని వెళ్ళిన ప్రజల, గిరిజనుల ఆశలపై నీళ్లు జల్లారన్నారు.

సంక్షేమ ఫలాలు అందించడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య



విశాలాంధ్ర-గంట్యాడ: ప్రతి ఇంటా సమస్యలు లేకుండా చేసి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయడమే వైసీపీ లక్ష్యమనిగజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ఎమ్మెల్సీ పి సురేష్ బాబుఅన్నారు చంద్రంపేటగ్రామంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు ఇంటింటికి వెళ్లి ప్రజలకు సంక్షేమపథకాలు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వారికి వెంటనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సురక్ష పథకం ద్వారా 11 రకాలైన ధ్రువపత్రాలను అందజస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ పీరు బండి హైమావతిజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరు బండి జైహింద్ కుమార్ జడ్పిటిసి వర్రి నరసింహమూర్తి ఏఎంసీ చైర్మన్ వేముల ముత్యాల నాయుడువైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు లచ్చిరెడ్డి కృష్ణ చలుమూరి వాసుదేవరావు సర్పంచ్ ఎంపీటీసీలుమండల అధికారులు వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.